సర్వే బృందాలకు ప్రజలు సహకరించాలి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 9 : ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ప్రజలు అందజేసిన దరఖాస్తుల్లో తప్పిదాలను సవరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే బృందాలను నియమించామని జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి రాఘవరావు, మండల అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని హుస్నేల్లి, గణేశ్‌పూర్, మామిడ్గి, శంశోల్లాపూర్ తదితర గ్రామాల్లో మహాలక్ష్మి పథకంలో రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం అందించనున్న నేపథ్యం లో ప్రజాపాలన దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామా ల్లో సర్వే బృందాలు పర్యటిస్తారన్నారు. మండలంలోని ప్రజలు సర్వే బృందాలకు సహకరించి సరైన వివరాలను తెలిజేయాలని సూచించారు. మండల అధికారులు, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేబృందాల సభ్యులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న మండలప్రత్యేకాధికారిరాఘవరావు, మండల అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డి

వందశాతం ఫలితాలు సాధించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 9: పదోతర గతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు ప్రత్యేక అధికారులకు సూచించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యేక ప్రణాళిక అమలుపై జిల్లాలోని కసూర్బాగాంధీ బాలిక విద్యాలయాల ప్రత్యేక అధికారులతో శుక్రవారం స్థానిక ఆర్వీఎం కార్యాలయంలో డీఈవో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. హాస్టళ్లలో మెనూ ప్రకారం సకాలంలో భోజనం అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు ఫైర్ సేఫ్టీ, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాలికా విద్య సమన్వయ కర్త సుప్రి య, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

బాగారెడ్డిపల్లిలో దళితుల నిరసన

జహీరాబాద్, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో 200యూనిట్లు ఉచిత విద్యుత్‌కు దరఖాస్తులు తీసుకొని, ఇప్పుడు మీటరు నంబర్, ఆధార్ కార్డుతో దరఖాస్తులు ఇవ్వాలని కోరాడం తగదని జహీరాబాద్ పట్టణ సీపీఐ కార్యదర్శి నర్సింహులు ఆరోపించారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లిలో దళితులు సామూహిక భవ నం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమలు బాగారెడ్డిపల్లిలో నిర్వహించకుండా విద్యుత్ అధికారులు తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని తెలుపుతున్నారని ఆరోపించారు. ఎస్సీలు నివాసించే ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతంలో నిర్వహించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. విద్యుత్ అధికారులు బాగారెడ్డిపల్లిలో సమావేశం ఏర్పాటు చేసిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో శేషారావు, స్వామిదాస్, కృష్ణ, అభిషేక్, గుండు, బాబు, ఆశయ్య, ప్రేమలమ్మ, అనితమ్మ, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాగారెడ్డిపల్లి ఎస్సీ సామూహిక భవనం ఎదుట నిరసన తెలుపుతున్న దళితులు

అంతర పంటలు సాగుచేయాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 9: వేసవిలో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు అంతర పంటలు సాగు చేయాలని ఏరువాక కేంద్రం సంగుపేట వ్యవసాయ శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత తెలిపారు. శుక్రవారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ రైతు వేదికలో పుచ్చకాయ, మొక్కజొన్న సాగుపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. బిందు సేద్యంతో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త శైలజ, జహీరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, అధికారులు శ్రీకాంత్, రాజశేఖర్, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, కృష్ణమోహన్, కృష్ణ, మాణ్యప్ప, రాజు, ఉద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మతిస్థిమితం లేని మహిళ

జిన్నారం, ఫిబ్రవరి 9 : మండలంలోని మాదారంలో మతిస్థిమితం లేని మహిళ శుక్రవారం హల్‌చల్ చేసింది. మాదారం ప్రభుత్వ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న తొట్ల నర్సింహ కుమారుడు తొట్ల విష్ణు (11) ఇంటి వద్ద ఆడుతుండగా మతిస్థిమితం లేని మహిళచేతిలో రాళ్లు పట్టుకొని బాలుడి వద్దకు రావడంతో భయపడి పరుగెత్తాడు. చుట్టు పక్కల వారు మహిళలను అడ్డుకొని వివరాలు ఆరాతీయగా సంబంధంలేని సమాధానాలు చెప్పింది. అంతేకాకుండా రాళ్లతో గ్రా మస్తుల మీదికి వెళ్లగా ఆమెను నిర్బంధించి బొల్లారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు.

ఆశవర్కర్లకు పారితోషికం చెల్లించాలి

సంగారెడ్డి, ఫిబ్రవరి 9: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు సహకరిస్తూ ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న ఆశవర్కర్లకు రెండు నెలల పారితోషికాలు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని ఆశవర్కర్లు, సీఐటీయూ సంఘం నాయకులు డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. రెండు నెలల నుంచి వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, ఆశ యూనియన్ జిల్లా నాయకులు యశోద, వీరమని, ప్రశాంతి, వైష్ణవి, తుల్జమ్మ, సంగీత, సావిత్రి, హైమావతి, శశికళ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు, సీఐటీయూ నాయకులు

చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

22మంది కౌన్సిలర్ల మద్దతు

అవిశ్వాసంపై ఓటింగ్‌లో పాల్గొన్న కౌన్సిలర్లు

సదాశివపేట, ఫిబ్రవరి 9 : సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బల్దియాలో మొత్తం 26 మంది కౌన్సిలర్లకు గానూ 22 మంది మద్దతు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 22 మంది సభ్యులు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తి ఓటు వేశారు. 22 మందిలో 17 మంది బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్, ఇద్దరు ఎంఐఎం, ఒకరు బీజేపీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. పేట మున్సిపల్‌లో మొత్తం 26 వార్డులు ఉన్నాయి. ఇందులో 22 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాగా, చైర్‌పర్సన్‌తోపాటు ముగ్గురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. 2వవార్డు కౌన్సిలర్ పరంజ్యోతి, 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడిరాజు, 13వ పిల్లోడి విశ్వనాథం, ఒకటో వార్డు కౌన్సిలర్, చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ సమావేశానికి హాజరుకాలేదు. అవిశ్వాసం నెగ్గేందుకు 18 మంది అవసరం కాగా 22 మంది మద్దతు తెలపడంతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో రవీందర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం ఆర్డీవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పురపాలక చట్టం ప్రకారం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించామన్నారు. సమావేశంలో ఎలాంటి చర్చలేకుండానే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అనుకూలంగా 22 మంది సభ్యులు ఓటు వేశారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చైర్‌పర్సన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ గణేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కేతకీలో మాఘ అమావాస్య పూజలు

కేతకీ సంగమేశ్వర ఆలయంలో క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

ఝరాసంగం, ఫిబ్రవరి 9 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయానికి తెలుగురాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్నారు. భక్తులు అమృతగుండంలో స్నానాలు ఆచరించి జల లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గర్భాలయంలోని పార్వతీదేవి సమేత కేతకీ సంగమేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మాఘ అమావాస్య ప్రత్యేక పూజలుగా లింగానికి క్షీరాభిషేకం, అన్న పూజ, గుండపూజ, కుంకుమార్చన రుద్రాభిషేకం చేశారు. మాఘ అమావాస్య కావడంతో 20వేలకు పైగా భక్తులు స్వామి దర్శనానికి వచ్చినట్లు కార్యనిర్వహణ అధికారి శశిధర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.

వాహనాల పార్కింగ్‌కు తప్పని తిప్పలు

ఆలయానికి ప్రతి సోమవారం, ప్రతి నెల అమావాస్యలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను నిలపడానికి పార్కింగ్ స్థలం లేక ప్రధాన రహదారిపైనే నిలుపుతున్నారు. దీంతో ఆలయానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయ ఆవరణలో పార్క్ చేసిన వాహనాలకు ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో చోరీకి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా వాహనాలకు ఆలయం తరపున పార్కింగ్ స్థలం కేటాయించి పర్యవేక్షణకు కాపలాదారులను నియమించాలని, దీనికి తగిన రుసుము వసూలు చేస్తే వాహనాల భద్రతతో పాటు ఆలయానికి ఆదాయం వస్తుందని భక్తులు కోరుతున్నారు.

వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో

రాయికోడ్, ఫిబ్రవరి 9 : అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాయికోడ్ గ్రామానికి చెందిన గండ్ల సంగన్న అన్నదానం ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ సిబ్బంది ఇందూరి కృష్ణ, పూ జరులు వీరేశం స్వామి, రుద్రయ్యస్వామి, బస్వరాజుస్వామి, శివకూమార్‌స్వామి ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9 : అంతర్గత డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేయాలని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డిని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పాన గేశ్ కోరారు. ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండీ సుదర్శన్‌రెడ్డిని ఆమె ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్సీపురం డివిజన్‌లోని కాలనీల్లో యూజీడీ పైప్‌లైన్ పనుల కోసం రూ.4.50కోట్లు నిధులు అవసరం ఉందని, ఆయా కాలనీల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశా రు. దీనికి స్పందించిన ఎండీ సుదర్శన్‌రెడ్డి దశలవారీగా యూజీడీ పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

కోహీర్, ఫిబ్రవరి 9 : అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సజ్జాపూర్‌లో సాగు చేస్తున్న అల్లం, చెరుకు, మొక్కజొన్న, బొప్పాయి, తదితర పంటలను ఆయన పరిశీలించారు. సేంద్రియ సాగుతో భూమి సార వంతంగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, ఏవో నవీన్‌కుమార్, ఏఈవో మౌనిక వర్మ పాల్గొన్నారు.

మహిళల నిరసన

బొల్లారం, ఫిబ్రవరి 9 : ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని వలస కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు వంటగ్యాస్ లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఈ మేరకు 50మంది మహిళలు ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. తమ గోడును స్థానిక బీఆర్ఎస్ యువత నాయకుడు ఆనంద్‌కృష్ణారెడ్డికి విన్నవించారు. కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డీఏలు చెల్లించాలి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 9 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన మూడు డీఏలను వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్ జాదవ్ కోరారు. శుక్రవారం నారాయణఖేడ్‌లోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన కంట్రి మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో మూడు డీఏలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సమావేశంలో మండల బాధ్యులు అంజయ్య, స్వామి, జైపాల్, నారాయణఖేడ్ మండల బాధ్యులు హరిసింగ్, రాజు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులు ఆపాలి

గుమ్మడిదల, ఫిబ్రవరి 9 : మండలంలోని నల్లవల్లి ప్యారనగర్ అటవీ ప్రాంతంలోని ర్మించనున్న డంపింగ్‌పనులు వెంటనే ఆపివేయాలని కోరుతూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ హెచ్‌వోఎఫ్ఎఫ్ అధికారికి శుక్రవారం జడ్పీటీసీ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. డంపింగ్‌యార్డు నిర్మాణం వల్ల నల్లవల్లి, కొత్తపల్లి, సూరారం, ప్యారనగర్ గ్రామాల్లో రైతులు పంట భూములు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, మం డలాధ్యక్షుడు హుస్సేన్ పాల్గొన్నారు.

చక్రియాల ఆలయ పాలకవర్గం ఏర్పాటుకు చొరవచూపాలి

మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చౌటకూర్, ఫిబ్రవరి 9: మండలంలోని చక్రియాల గ్రామంలోని అతి పురాతనమైన లక్ష్మీ అనంత పద్మనాభస్వామి ఆలయ నూతన పాలకవర్గ ఏర్పాటుకు చొరవ చూపాలని కాంగ్రెస్ నాయకులు మంత్రి దామోదర రాజనరసింహను కోరారు. ఈ మేరకు పలువురు శుక్రవారం సంగారెడ్డిలోని మంత్రి దామోదర నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి విజ్ఞప్తి చేశారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని, తద్వారా సిమెంటు రోడ్లు, మురుగు కాల్వలు, హైమాస్ట్ లైట్లు వంటి మౌలిక వసతులు తీరుతాయన్నారు. ఆలయ పాలకవర్గం పదవీకాలం పూర్త య్యి దాదాపు రెండేండ్లవుతుందని తెలియజేశారు. మంత్రిని కలిసినవారిలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిన్నరోళ్ల పాటి రాజశేఖర్, నాయకులు భానూరి లక్ష్మణ్, బోడపట్ల ఆనందం, రోళ్లపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

10లోగా గ్యాస్ కనెక్షన్ల వివరాలు సరిచేయాలి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 9 : మహాలక్ష్మి పథకంలో గ్యాస్ కనెక్షన్ వివరాలు ఈ నెల 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మహాలక్ష్మి గ్యాస్‌కనెక్షన్ల డేటా సరిచేయడం, గృహజ్యోతి తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. అధిక అప్లికేషన్లు ఉన్న చోట ఎక్కువ లాగిన్స్ తీసుకోవాలన్నారు. ప్రతి లాగిన్‌లో ప్రతి రోజూ 40 నుంచి 60 దరఖాస్తులు సరిచేయాలని సూచించారు. డే టా సరి చేయడం మరింత వేగవంతం చేయాలని, ఎంపీడీవోలు క్షేత్రపరిధిలో తనిఖీ చేయాలన్నారు. సంబంధిత సిబ్బంది వచ్చినప్పుడు దరఖాస్తుదారులు ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రతాకార్డు(రేషన్ కార్డు) నంబరు, ఆధార్‌కార్డ్ నంబర్, విద్యుత్ బిల్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వ కర్మ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు.

టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సురేశ్ మోహన్, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పదవులు కాదు ప్రజాసేవ ముఖ్యం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 9 : పదవులు ప్రాముఖ్యం కాదని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేయడమే గొప్పతనమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో వారిని మాజీ ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అన్ని రంగాలల్లో అభివృద్ధి చేశానని అన్నారు. ఓడిపోయామని ఆధైర్య పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రజలకు అందించే వరకు పోరాడుదామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్, పార్టీ మండలాధ్యక్షుడు రాంసింగ్, ఎంపీపీ మండల ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు దుర్గారెడ్డి, కల్హేర్ ఎంపీటీసీ సంగప్prop, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఘనీ, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు సంతోష్ కుమార్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కల్హేర్ మండల మాజీ సర్పంచులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నేటి నుంచి సిలువగుట్ట జాతర

కొండాపూర్, ఫిబ్రవరి 9 : యేసుక్రీస్తు పరిశుద్ధ సిలువగుట్ట జాతర ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్నాయి. ఈ జా తర ఉత్సవాలు ప్రతి ఏడాది రెండో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్ మండ లం గంగారం, రంగారెడ్డి జిల్లాలోని మోమిన్‌పేట మండలం టేకులపల్లి గ్రామాల శివారు ల్లో ఈ ఉత్సవాలను కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తారు. ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మెదక్, ఉమ్మడి హైదరాబాద్, జిల్లాలతో పాటుగా దూర ప్రాంతాల నుంచి క్రైస్తవ భక్తులు మూడు రోజులు గుట్టపై ఉండి ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..
- సత్యానందం ప్రెసిబిటరీ ఇన్‌చార్జి

గంగారం-టేకుపల్లి గ్రామాల మధ్య జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతరకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలి.

కొండపై వెలసిన పరిశుద్ధ సిలువ

భూముల సర్వే

కంది, ఫిబ్రవరి 9: కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు కంది మండల పరిధిలో క్రషర్లకు కేటాయించిన భూములకు శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. రెండేండ్ల పాటు లీజ్‌కు ప్రభుత్వం ఎర్రనూర్ సమీపంలో పలుక్రషర్ కంపెనీలకు భూమిని కేటాయించింది. తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఆర్ఐ వెంకట్రామ్‌రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

జిన్నారం, ఫిబ్రవరి 9 : జిన్నారం సీఐగా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌కుమార్‌ను జిన్నారం కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు సహకారం ఉంటుందని సీఐకి తెలిపారు. యూత్ నాయకులు నరేశ్, నరేందర్ పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోల్ పోయొద్దు

సంగారెడ్డి, ఫిబ్రవరి 9 : సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న పెట్రోల్ దాడులు, హత్యలతో యువత చెడుదారిన పడుతుందని, ముఖ్యంగా ప్లాస్టిక్ బాటిల్స్, క్యాన్లలో పెట్రోల్ పోయొద్దని పెట్రోల్ బంకుల యజమానులకు ఎస్పీ చెన్నూరి రూపేశ్ శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. ముఖ్యంగా పెట్రోల్ బంకుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా బాటిల్స్‌లో పెట్రోల్ పోయాలని బలవంతం చేస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 9: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా సైన్స్ కేంద్రం లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పెయింటింగ్, కవిత్వం, ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించి ఒక్కో విభాగంలో ముగ్గురు చొప్పున విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందే విద్యార్థులను ఈ నెల 28న రవీంద్ర భారతిలో బహుమతులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి లింబాజి, సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, వ్యాఖ్యా త డాక్టర్ పూర్ణ కృష్ణ, ఎన్‌జీసీ కో-ఆర్డినేటర్ మాధవరెడ్డి, సీఎంవోలు అనిల్ కుమార్, వెంకటేశం పాల్గొన్నారు.

'ఆదర్శ' విద్యార్థి ప్రతిభ

బొల్లారం, ఫిబ్రవరి 9 : జిల్లాస్థాయి సైన్స్ పోటీల్లో బొల్లారం ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ప్రణీత్ తృతీయ బహుమతి సాధించినట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. నేషనల్ సైన్స్ డే కాంపిటేషన్‌లో భాగంగా జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన ప్రణీత్‌కు విద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రంతో పాటు అవార్డు అంద జేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయులు సస్పెన్షన్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 9 : విద్యార్థులపై అమర్యాదగా ప్రవర్తించారనే ఆరోపణలపై ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు మండల విద్యాధికారి ప్రాథమిక నివేదిక మేరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై అమర్యాదగా ప్రవర్తించారనే అభియోగాలపై పటాన్‌చెరు మండలం, ప్రాథమిక పాఠశాల ముత్తంగిలో పనిచేస్తున్న ఎస్జీటీలు సందీప్‌రెడ్డి, నర్సింహులును విధులను నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

పీవీకి భారతరత్నపై హర్షం

జిన్నారం, ఫిబ్రవరి 9 : తెలంగాణ ప్రాంత వ్యక్తి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. జిన్నారం మండల అఖిలపక్ష నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. మండల కేంద్రం జిన్నారంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిన్నారం మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ ఉన్నారు.

అక్రమ ఇసుక ఫిల్టర్ల కూల్చివేత

కంది, ఫిబ్రవరి 9 : కంది మండలం బ్యాతోల్ గ్రామ